క్లుప్తంగా

విద్యార్థికి రూ.లక్ష ఆర్థికసాయం



వనపర్తి టౌన్: కొత్తకోట మండలంలోని అప్పరాలకు చెందిన నరసింహారెడ్డి కుమార్తె నిఖిత మెడికల్ సీటు సాధించడంతో వనపర్తిలో వైద్యుడిగా పనిచేస్తున్న రాఘవేందర్‌రెడ్డి రూ.లక్ష ఆర్థికసాయం అందించారు. ఈ మేరకు శనివారం ఆర్థికసాయాన్ని విద్యార్థినికి అందించిన డాక్టర్‌ను రెడ్డి సేవా సమితి ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా డాక్టర్ రాఘవేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రతిభ కలిగిన పేద విద్యార్థులకు సమాజంలో ఆదరించే వ్యక్తులు ఎప్పుడు ఉంటారని చెప్పారు. సహాయం పొందడం, చేయడం గొప్ప కాదని, అవకాశాన్ని అనుకూలంగా మలుచుకొని లక్ష్యాన్ని చేరుకునేలా విద్యార్థి చదువులో రాణించాలని ఆకాంక్షించారు.

బాధిత కుటుంబానికి అండగా ఉంటాం



చిన్నంబావి: మండలంలోని అమ్మాయిపల్లికి చెందిన మహేష్‌గౌడ్ ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న కేఎంఆర్ ట్రస్ట్ చైర్మన్ కొత్త కళ్యాణ్‌రావు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. తల్లిదండ్రులకు అండగా ఉంటాడనుకున్న మహేష్ అకాల మరణం పొందడం చాలా బాధాకరమని వాపోయారు. అధైర్యపడవద్దని, తాను అండగా ఉంటానని తల్లిదండ్రులకు భరోసా కల్పించారు. అనంతరం వారికి రూ.10 వేలు ఆర్థిక సాయం అందించారు.

ఎమ్మార్సీ కార్యాలయానికి చేరిన పాఠ్యపుస్తకాలు



పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయానికి పాఠ్యపుస్తకాలు చేరినట్లు ఎంఈఓ లక్ష్మణ్‌నాయక్ శనివారం తెలిపారు. కార్యాలయానికి చేరిన పుస్తకాలను పాఠశాలల వారీగా సీఆర్పీలు వేరు చేస్తున్నారన్నారు. మండలంలోని 36 పీఎస్, మూడు యూపీఎస్, 11 ఉన్నత పాఠశాలలకు సంబంధించి మొత్తం 17,400 పాఠ్యపుస్తకాలకు 17వేల పాఠ్యపుస్తకాలు వచ్చినట్లు ఆయన పేర్కొన్నారు. వచ్చిన పాఠ్య పుస్తకాలల్లో 7వ తరగతి తెలుగు, 10వ తరగతి హిందీ పుస్తకాలు మినహా అన్ని పుస్తకాలు వచ్చామన్నారు. వాటిని పాఠశాలల హెచ్‌ఎంలకు అందజేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.

రోడ్లు, భవనాల క్లస్టర్ కార్యాలయం ప్రారంభం



పాన్‌గల్: మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం సముదాయంలో రోడ్లు, భవనాల క్లస్టర్ కార్యాలయాన్ని డీఈఈ సీతారామస్వామి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అవతరణ శతాబ్ది ఉత్సవాల్లో భాగంగా సుపరిపాలన దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆర్‌అండ్‌బీ శాఖ ఆధ్వర్యంలో ఈ క్లస్టర్ కార్యాలయాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. రోడ్లు, భవనాల శాఖకు సంబంధించిన సమస్యలను ఏఈ దృష్టికి తీసుకొస్తే వీలైనంత వరకు ఇక్కడే పరిష్కారం అవుతాయని, క్లిష్ట పరిస్థితులు ఉంటే జిల్లా అధికారుల దృష్టికి తీసుకొచ్చి, వాటి పరిష్కారం కోసం కృషి చేస్తారన్నారు. ఏఈ రాకేష్, టీఓ ప్రకాష్, శ్రీనివాసులు ఉన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య

ఆత్మకూర్: ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్య అందిస్తున్నామని, పిల్లలను పనులకు కాకుండా బడికి పంపాలని ఎంఈఓ భాస్కర్ సింగ్, సీఆర్పీ సౌమ్యరాణి అన్నారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం, విద్యాశాఖ ఆదేశాల మేరకు ఆత్మకూర్ మండలంలోని గ్రామాల్లో బడి బయటి విద్యార్థుల వివరాలను నమోదును ముమ్మరంగా చేపట్టారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేటుకు దీటుగా ఇంగ్లిష్ మీడియం బోధన చేపడుతున్నారనిచ తల్లిదండ్రులు తమ పిల్లలను పాఠశాలలకు పంపించాలని కోరారు.



అందరి సహకారంతోనే అభివృద్ధి

కొత్తకోట: మున్సిపాలిటీలో దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా పురపాలక సంఘం కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం వాహనాలను ముస్తాబు చేసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ పొగాకు సుఖేశిని మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో రంగోళి కార్యక్రమం నిర్వహించారు. అలాగే రాష్ట్రం ఏర్పాటు తరువాత మున్సిపాలిటీలో జరిగిన అభివృద్ధి పనులు, పథకాల అమలు గురించి ప్రజలకు అవగాహన కల్పించారు.

ఆత్మకూర్: కొత్తగా ఏర్పడిన ఆత్మకూర్ మున్సిపాలిటీలో ప్రజల సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతూ ముందుకెళ్తున్నామని చైర్‌పర్సన్ గాయత్రి, వైస్‌చైర్మన్ విజయభాస్కర్‌రెడ్డి, కమిషనర్ రమేష్ అన్నారు. శనివారం స్థానిక మున్సిపాలిటీ కార్యాలయం ఆవరణలో సుపరిపాలన దినోత్సవం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ రూ.కోట్లు వెచ్చించి డివైడర్లు, సీసీ రోడ్లు, డ్రెయినేజీలు, వీధి దీపాలు, పార్కులు, క్రీడా మైదానాలు, హరితహారం, వైకుంఠధామం, మార్కెట్ అభివృద్ధి పనులను చేపట్టామన్నారు. వేడుకల్లో భాగంగా బతుకమ్మ, కోలాటం, చిన్నారుల నృత్యాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మహిళా సంఘాల సభ్యులు, కుటుంబ సమేతంగా హాజరై బతుకమ్మ పాటలకు నృత్యాలు చేసారు. వారికి పాలక మండలి సభ్యులు బహుమతులు అందజేసి ప్రశంసించారు.

అమరచింత: ప్రజల సహకారం, అన్ని రాజకీయ పార్టీల సూచనలతో మున్సిపాలిటీని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్తున్నామని మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, వైస్ చైర్మన్ జీఎస్ గోపి అన్నారు. దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా శనివారం సుపరిపాలన దినోత్సవాన్ని మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించారు. ఈమేరకు మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి ఇప్పటి వరకు పట్టణంలో చేసిన అభివృద్ధి పనులతో పాటు మున్సిపాలిటీకి మంజూరయ్యే నిధుల గురించి వివరించారు. గ్రామ పంచాయతీగా ఉన్నప్పుడు అంతర్గత రహదారుల వ్యవస్థ అధ్వాన్నంగా ఉండేదని, ప్రస్తుతం రూ.3.5కోట్లతో సీసీ రహదారులను వార్డుల వారిగా ప్రతి కాలనీలో వేశామన్నారు. మురుగుకాల్వల నిర్మాణాలతో పాటు మున్సిపల్ కార్యాలయానికి శాశ్వత భవనం ఏర్పాటు చేసుకున్నామని తెలిపారు. తడి, పొడి చెత్తలను నేరుగా ఆయా కాలనీకి వెళ్లి ట్రాక్టర్లు, ఆటోల ద్వారా సేకరించడంతో పరిసరాలు పరిశుభ్రంగా మారాయని సభకు వివరించారు. ప్రజలకు మున్సిపల్ చట్టాలపై అవగాహన కల్పించడం ద్వారా ఇంటి, కుళాయి పన్నులు సకాలంలో చెల్లించి సిబ్బంది సహకరిస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో కమిషనర్ మహమ్మద్ ఖాజా, కౌన్సిలర్లు సింధు, లక్ష్మి, ఉషారాణి, మాధవి, రాజ్‌కుమార్, ఆర్‌ఐ కృష్ణయ్య, బాలగోవింద్ తదితరులు పాల్గొన్నారు.



కొత్తకోటలో పథకాలపై అవగాహన కల్పిస్తున్న మున్సిపాలిటీ పాలకవర్గం

తహసీల్దార్ కార్యాలయంలో..

సుపరిపాలన దినోత్సవం సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో శనివారం మండల ప్రజా ప్రతినిధులు, యువకుల సమక్షంలో కేక్ కట్ చేసి సంబురాలను జరుపుకొన్నారు. తహసీల్దార్ షేక్ చాంద్‌పాషా కేక్ కట్ చేసి ప్రభుత్వం అందిస్తున్న సుపరిపాలన గురించి వివరించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ మంగమ్మ, డీటీ అనురాధ, ఆర్‌ఐ గోపాల్, సీనియర్ అసిస్టెంట్ వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని మున్సిపాలిటీ కార్యాలయం ఆధ్వర్యంలో శనివారం వాహనాలను ముస్తాబు చేసి సుభాష్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్ చైర్మన్ కర్రెస్వామి, కమిషనర్ ఆదిశేషు, మేనేజర్ గణేష్‌బాబు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

పెబ్బేరు రూరల్: శ్రీరంగాపురం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ గాయత్రి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రొఫెసర్ జయశంకర్, తెలంగాణ తల్లి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో అధ్యక్షుడు జగన్నాథం, కోఆప్షన్ సభ్యుడు ఆరీఫ్, ఎంపీడీఓ ప్రసన్న కుమారి తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ నాగేంద్రం ఆధ్వర్యంలో సుపరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కృష్ణయ్య, వైస్ ఎంపీపీ యాదమ్మ, డిప్యూటీ తహసీల్దార్ అశోక్‌కుమార్, కో ఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, సర్పంచులు రాంనారాయణ, కురుమూర్తి, శ్రీనివాసులు, అరుణరమేష్, జగన్, ఎంపీటీసీ కురుమన్న పాల్గొన్నారు.



ఆత్మకూర్‌లో..



అమరచింత మున్సిపల్ కార్యాలయంలో..



అమరచింత తహసీల్దార్ కార్యాలయంలో..



మదనాపురం ఎంపీడీఓ కార్యాలయంలో..



శ్రీరంగాపురంలో..



పెబ్బేరులో..

కేజీవీబీ నుంచి అండర్ డ్రెయిన్ ఏర్పాటు

మదనాపురం: మండల కేంద్రంలోని కస్తుర్బాగాంధీ పాఠశాల ఆవరణంలోని ఔట్ లేట్ నీరు సమీపంలోని డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకు చేరడంతో ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సీడీపీ నిధులు రూ.5లక్షలతో అండర్ డ్రెయినేజీని ఏర్పాటు చేస్తున్నామని జెడ్పీటీసీ కృష్ణయ్య వెల్లడించారు. శనివారం నిర్మాణ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇక్కడ సమస్య ఉందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకుపోవడంతో ఆయన తక్షణమే స్పందించి నిధులు మంజూరు చేశారని పేర్కొన్నారు. డ్రెయిన్ నిర్మాణం చేసి మ్యాన్‌హోల్ ఏర్పాటే చేస్తే సమస్య పరిష్కారం అవుతుందన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బిట్ల యాదగిరి, సర్పంచులు రాంనారాయణ, ఎంపీటీసీలు కురుమన్న, సరస్వతి రాంచందర్, కురుమూర్తి, అరుణ రమేష్, జగన్, శ్రీనివాసులు, మండల కో ఆప్షన్ సభ్యుడు చాంద్ పాషా, ఆవుల బాలకృష్ణ, అధికారులు పాల్గొన్నారు.

పౌల్ట్రీ ఫార్మ్ వ్యర్థాలను అరికట్టండి



పెబ్బేరు: మండలంలోని కంచిరావుపల్లి శివారులో ఉన్న స్నేహ పౌల్ట్రీ ఫార్మ్ నుంచి దుర్వాసన రావడంపై స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు శనివారం వినతిపత్రం అందజేశారు. గ్రామ శివారులో నిర్మించిన స్నేహ పౌల్ట్రీ ఫార్మ్‌ల నుంచి ప్రతి రోజు వ్యర్థాల దుర్వాసన రావడంతో ప్రజలు శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అలాగే పక్కనే ఉన్న పంట పొలాల్లో కూలీలు, రైతులు పని చేయలేకపోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శికి ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో జయసుధ, మహేశ్వరి, చెన్నమ్మ, రేణుక, శేషన్నగౌడ్, భాస్కర్‌గౌడ్, గోపాల్, బీసన్న, మన్నెమ్మ, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

ధ్యానంతో మానసిక ప్రశాంతత



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న సభ్యులు

చిన్నంబావి: ధ్యానం చేయడం వల్ల సమస్త రోగాల నుంచి ఉపశమనం లభిస్తుందని పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్లా అంజనేయరెడ్డి, ధ్యాన ప్రచారకర్త గుండం తిరుపతయ్య అన్నారు. ప్రస్తుతం శరీరంలో ఉన్న ఎలాంటి రోగాలనైనా తగ్గించి భవిష్యత్‌లో వ్యాధులు రాకుండా ధ్యానం కాపాడుతుందని వారు అన్నారు. శనివారం వెలగొండ, మియాపూర్, గడ్డ బస్వాపురం, బెక్కం గ్రామాల్లో ప్రజలకు ధ్యానంపై అవగాహన కల్పించారు. తలనొప్పి మొదలుకొని క్యాన్సర్ లాంటి ప్రమాదకర జబ్బులను కూడా ధ్యానం ద్వార తగ్గించుకోవచ్చన్నారు. నిత్య జీవితంలో ఎన్నో సమస్యలతో సతమతమవుతూ ఒత్తిడికి గురయ్యే వారికి ధ్యానం ప్రశాంతతను ఇస్తుందని తెలిపారు. దినచర్యలో ధ్యానం చేయడం ఒక అలవాటుగా మార్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పిరమిడ్ సంస్థ సభ్యులు వెంకటలక్ష్మి, శైలజ, శోభిత, లలిత, కృష్ణమద్దిలేటి, విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

అర్హులకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయాలి

చిన్నంబావి: మండలంలోని పెద్దదగడలో సర్వే నెంబర్ 30లో 4 ఎకరాల 1గంట భూమిని 15ఏళ్ల క్రితం ప్రభుత్వం కొనుగోలు చేసినా.. ఇప్పటి వరకు పేదలకు ఇళ్ల స్థలాల కోసం పంపిణీ చేయకుండా చోద్యం చూస్తుందని ప్రజా సంఘాల నాయకులు ఆరోపించారు. శనివారం తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం ఆధ్వర్యంలో పెద్దదగడలో ఉన్న ప్రభుత్వ ఖాళీ భూమిలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ఆందోళన చేపట్టారు. వెంటనే ప్రభుత్వం ఈ భూమిని అర్హులైన పేదలకు ఇవ్వకుంటే పేదలను సమీకరించి గుడిసెలు వేసి పోరాటాలకు దిగుతామని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో ఆంజనేయులు, రాజేందర్‌గౌడ్, దర్గా స్వామి, వెంకటస్వామి, కృష్ణ, శ్రీను, మహేష్, శ్రీను, వెంకట్, రాములు, చిన్న, బాబన్న పాల్గొన్నారు.



ఆందోళన చేస్తున్న ప్రజాసంఘాల నాయకులు

ధర్నాను జయప్రదం చేయాలి

వనపర్తి టౌన్: హైదరాబాద్‌లో ధర్మ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో ఈనెల 12వ తేదీన నిర్వహించే భారీ ధర్నాను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా ప్రచారకులు ఎల్లయ్య పిలుపునిచ్చారు. ఈ మేరకు ధర్నా కరపత్రాలను శనివారం జిల్లా కేంద్రంలో విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని గ్రంథాన్ని అందరికీ అందించాలని మే 2వ వారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్లకు, తహసీల్దార్లకు వినతిపత్రం ఇస్తున్నప్పటికీ ప్రభుత్వం నుండి ఎలాంటి స్పందన లేకపోవడంతో ధర్నా చేపడుతున్నట్లు పేర్కొన్నారు. రాజ్యాంగ గ్రంథాన్ని ప్రతి పౌరుడికి అందించడంతో పాటు పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు ఒక సబ్జెక్టుగా బోధించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సూర్య ప్రకాశ్, మన్యం, వెంకటయ్య, నాగరాజ్, లక్ష్మణ్, శ్రీనివాసులు, తరుణ్, మధు, బాలరాముడు తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ నిర్మాణ పనుల అడ్డగింత



పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని ప్రధాన రోడ్డుకు ఇరువైపులా చేపడున్న డ్రెయినేజీ నిర్మాణం పనులను శనివారం స్థానికులు అడ్డుకున్నారు. మున్సిపాలిటీ అభివృద్ధిలో భాగంగా రూ.2 కోట్లతో చేపట్టిన డ్రెయినేజీ నిర్మాణ పనులు చేపట్టారు. దీనిపై అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్ ఇష్టారీతిగా నాసిరకంగా పనులు చేస్తున్నారు. శుక్రవారం రాత్రి కురిసిన వర్షానికి డ్రెయినేజీలు కిందపడడంతో షాపు యాజమాన్యులు, స్థానికులు పనులను అడ్డుకొని జేసీబీ అద్దాలు పగలగొటి అధికారులతో వాగ్వివాదానికి దిగారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పట్టణంలో నిర్మాణం పనులను పర్యవేక్షించాలని స్థానికులు కోరారు.

ఆధార్ కేంద్రం అందుబాటులో ఉండాలి

పెబ్బేరు: ఉమ్మడి పెబ్బేరు, శ్రీరంగాపూర్ మండలాల్లో ప్రజలకు నిరంతరం ఆధార్ కేంద్రం అందుబాటులో ఉండేలా అధికారులు చర్యలు తీసుకోవాలని యూత్ కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు అల్వాల సాయిగౌడ్ శనివారం ఒక ప్రకటనలో కోరారు. పట్టణ కేంద్రంలోని మున్సిపాలిటీ, తహసీల్దార్ కార్యాలయంలోని ఆధార్ సెంటర్ల నిర్వాహకులు ప్రతి రోజు వారి పనుల నిమిత్తం కేంద్రంలో అందుబాటులో లేకపోవడంతో ప్రజలు మీ సేవా కేంద్రాల చుట్టూ తిరుగుతూ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ప్రభుత్వ పథకాల ప్రకటనలతో ఆధార్ అప్‌డేట్, అడ్రస్ మార్పిడి, బయోమెట్రిక్, మొబైల్ అనుసంధానంతో పాటు చిన్న పిల్లలకు కొత్తగా తీసుకునే ఆధార్ ఫీడింగ్ కోసం కేంద్రం నిర్వాహకులు నిరంతరం అందుబాటులో ఉండేలా చూడాలని కోరారు.

రిజర్వాయర్ మాకొద్దు సారూ..

గోపాల్‌పేట: తమ పొలాలను ముంచుతూ రిజర్వాయర్ నిర్మాణం చేపట్టవద్దని బుద్దారం గ్రామస్తులు నిరసన వ్యక్తం చేశారు. బుద్దారం చెరువును ఇటీవల రిజర్వాయర్‌గా ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అనుమతులు జారీ చేసింది. నాలుగు రోజులుగా రిజర్వాయర్ నిర్మాణంలో రైతుల భూమి ఎంత పోతోంది, రిజర్వాయర్ కట్ట ఎంత మేర నిర్మిస్తారు, నష్ట పరిహారంపై అధికారులు స్పందించాలని గ్రామస్తులు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తూ వస్తున్నారు. రిజర్వాయర్‌లో ఒండ్రుమట్టి తీసేందుకు కాంట్రాక్టర్ ప్రయత్నించగా రైతులు అడ్డుకున్నారు. గురువారం చెరువుల పండుగ ఉండటంతో ఆరోజు అధికారులు ఎవరూ రాలేదు. శనివారం జిల్లా నుంచి ఇరిగేషన్ శాఖకు చెందిన ఏఈ సర్వేయర్లను తీసుకొచ్చి బుద్దారం చెరువులో సర్వే చేస్తుండగా గ్రామస్తులు, రైతులు వెళ్లి రిజర్వాయర్‌కు సంబంధించిన పూర్తి వివరాలు చెప్పాలని నిలదీశారు. దీంతో అధికారులు మాట్లాడుతూ ఒకటి లేదా రెండు మీటర్లు ఎత్తు కట్ట పెరగొచ్చని సమాధానం చెప్పారు. అలా అయితే తమ భూములు మొత్తం రిజర్వాయర్‌లో పోతాయని ఆవేదన వ్యక్తం చేశారు. బుద్దారం చెరువును రిజర్వాయర్ చేస్తే తాము నష్టపోతామని అధికారులకు తెగేసి చెప్పారు. దీంతో చేసేదేం లేక అధికారులు వెనుదిరిగారు.



సర్వేయర్‌తో మాట్లాడుతున్న గ్రామస్తులు

బాలకార్మిక వ్యవస్థను అరికట్టాలి



చిన్నంబావి: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరి బాధ్యత అని శనివారం శ్రామిక వికాస కేంద్రం స్వచ్ఛంద సంస్థ సభ్యులు అన్నారు. ప్రపంచ బాలకార్మిక వ్యతిరేక దినోత్సవం వారోత్సవాల్లో భాగంగా శనివారం తహసీల్దార్ కార్యాలయంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జెడ్పీటీసీ కేసిరెడ్డి వెంకట్రమణమ్మ, తహసీల్దార్ ఝాన్సీరాం నాయక్ చేతుల మీదుగా కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ బాల కార్మిక వ్యవస్థ నిర్మూలన అందరూ సహకరించాలని, బడి ఈడు కలిగిన ప్రతి చిన్నారిని పాఠశాలకు పంపించాలని కోరారు. అనంతరం మండలంలోని అమ్మాయిపల్లి అంగన్‌వాడీ కేంద్రం వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో శ్రామిక వికాస కేంద్రం మండల కోఆర్డినేటర్ మీసాల మహేష్, బీఆర్‌ఎస్ నాయకుడు చిన్నారెడ్డి, అయ్యవారిపల్లి సర్పంచ్ రామస్వామి, సింగిల్ విండో డైరెక్టర్ డేగ శేఖర్, ఎస్వీకే సిబ్బంది హైమావతి, సుమతి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం

వనపర్తి టౌన్: దివ్యాంగులకు సీఎం కేసీఆర్ వచ్చే నెల నుంచి రూ. 4,116 పింఛన్ ఇచ్చేందుకు నిర్ణయం తీసుకోవడంపై హర్షం వ్యక్తం చేస్తూ శనివారం సాయంత్రం జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌక్‌లో సీఎం కేసీఆర్ చిత్రపటానికి దివ్యాంగులు బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి పాలాభిషేకం చేశారు. నిరాధరణకు గురవుతున్న దివ్యాంగులకు అండగా ఉండేందుకు సీఎం కేసీఆర్ అదనంగా రూ.వెయ్యి ఫింఛన్ పెంచారని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టుయాదవ్ అన్నారు. దివ్యాంగుల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం అనేక సంక్షేమాలు ప్రవేశ పెట్టిందన్నారు.కార్యక్రమంలో వైస్ చైర్మన్ శ్రీధర్, గులాం ఖాధర్, మధులత, శ్రీను, దివ్యాంగుల పట్టణ అధ్యక్షుడు గుట్ట శేఖర్, కార్యదర్శులు శ్రీనివాసులు, చంద్రయ్య, అన్నపూర్ణ, లక్ష్మి, విజయ్, కురుమూర్తి, రవి, రాఘవేందర్, రాంలీల, కృష్ణవేణి, అలివేల తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట: పట్టణ కేంద్రంలో చౌరస్తాలో మున్సిపాలిటీ పాలక వర్గం ఆధ్వర్యంలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి శనివారం దివ్యాంగులు, ప్రజాప్రతినిధులు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీ వైస్ చైర్మన్ వామన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తకోట రూరల్: దివ్యాంగులకు ప్రస్తుతం ఇస్తున్న పింఛన్‌కు అదనంగా రూ.వెయ్యి పెంచుతున్నట్లు సీఎం కేసీఆర్ ప్రకటించడంతో పెద్దమందడి మండలంలోని దివ్యాంగులు ఆనందం వ్యక్తం చేశారు. శనివారం పామిరెడ్డిపల్లిలో గ్రామస్తులు, దివ్యాంగులు కలిసి సీఎం కేసీఆర్, మంత్రి నిరంజన్‌రెడ్డిల చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ సిద్ధయ్య, మన్నెపురెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, నాగేంద్రం, భీంరెడ్డి, లక్ష్మణ్‌గౌడ్, ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

మదనాపురం: దివ్యాంగులకు ప్రభుత్వం అందించే పింఛన్‌కు అందనంగా మరో రూ.వెయ్యి పెంచడంతో మండల కేంద్రంలోని గ్రంథాలయం ఆవరణలో శనివారం దివ్యాంగులు, మండల ప్రజాప్రతినిధులు సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కృష్ణయ్య, వైస్ ఎంపీపీ యాదమ్మ, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు బిట్ల యాదగిరి, సర్పంచ్‌లు రాంనారాయణ, కురుమూర్తి, శ్రీనివాసులు, ఎంపీటీసీల సంఘం మండల అధ్యక్షుడు కురుమయ్య, కో ఆప్షన్ సభ్యుడు చాంద్‌పాషా, పట్టణ అధ్యక్షుడు ఆవుల బాలు తదితరులు పాల్గొన్నారు.



వనపర్తిలో సీఎం కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న దివ్యాంగులు, బీఆర్‌ఎస్ నాయకులు



మదనాపురంలో..



పామిరెడ్డిపల్లిలో..

గ్రామకంఠం భూములంటూ సొంత స్థలాలకు నోటీసులు

అమరచింత: పట్టణంలోని గ్రామకంఠం స్థలాలను స్వాధీనం చేసుకోవడంలో విఫలమైన మున్సిపల్ పాలక వర్గం.. సొంత స్థలాలు కలిగి ఉన్న యజమానులకు గ్రామ కంఠం భూములంటూ ఫేక్ నోటీసులు జారీ చేశారు. పట్టణంలోని పదోవార్డులో నివాసం ఉంటున్న తిరుమల బాల్‌రాం, తిరుమల పద్మయ్య మరణాంతరం వారి ఆస్తులను అన్నదమ్ముల పిల్లలైన నలుగురు సమానంగా పంచుకున్నారు. వీటికి సంబంధించి డాక్యుమెంట్లను చూపుతూ సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఇంటి స్థలాలను వారి పేర్లపై రిజిస్టర్ చేసుకున్నారు. ప్రస్తుతం ఆ స్థలం తమది కాదని, గ్రామకంఠం భూమి అని మున్సిపల్ కార్యాలయం ద్వారా నోటీసులు జారీ చేశారని బాధితులు వాపోయారు. దీంతో సదరు వ్యక్తులు తమ సొంత స్థలాలకు నోటీసులు ఎందుకు ఇచ్చారని మున్సిపల్ కార్యాలయానికి వెళ్లి అధికారులను ప్రశ్నించడంతో అసలు విషయం బయట పడింది. పట్టణంలో ప్రభుత్వ స్థలాలను స్వాధీనం చేసుకొని ఇంటి నిర్మాణాలు చేస్తున్న వారిని అడ్డుకోలేని మున్సిపల్ అధికారులు.. సొంత స్థలం ఉన్న వారికి ఎలా నోటీసులు ఇస్తారని నిలదీయడంతో అధికారులు వారి వద్ద ఉన్న ఇంటి పత్రాలను పరిశీలించి వెనక్కి పంపారు.



మున్సిపాలిటీ జారీ చేసిన నోటీసులు చూపుతున్న తిరుమల రాములమ్మ

గతంతో జరిగిన సంఘటనలతో..



అమరచింత పంచాయతీ ఉన్నప్పుడు సర్పంచ్‌ల సాయంతో కొంతమంది ఇలాంటి ఫేక్ డాక్యుమెంట్లు సృష్టించిన విషయాలు తమ దృష్టికి వచ్చాయి. ఇలాంటి ఘటలు పునరావృత్తం కాకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో గ్రామంలో ఉన్న గ్రామకంఠం భూములను గుర్తించి, వాటికి సంబంధించి ఎవరెవరు కబ్జాలో ఉన్నారనే విషయాలను తెలుసుకునేందుకు నోటీసులను అందించాం. మున్సిపాలిటీ తీర్మాణం ప్రకారమే వీటి గురించి వివరాలు సేకరిస్తున్నాం. ఇందులో భాగంగానే తిరుమల బాల్‌రాం, పద్మయ్యకు సంబంధించిన ఖాళీ స్థలాలపై విచారించేందుకు నోటీసులు జారీ చేశాం.

– మహమ్మద్ ఖాజా, కమిషనర్, అమరచింత